■ నిజం చెప్తున్నా

# ఒక హిజ్రా ఆత్మకథ

రేవతి



నిజం చెప్తున్నా

# ఒక హిజ్రా ఆత్మకథ

ఎ. రేవతి

తెలుగు : పి. సత్యవతి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 130/- |
| ఆంగ్లమూలం | : | The Truth About Me: A Hijra Life Story, A. Revathi, Penguin Books India, 2010 |
| | | © A. Revathi 2010 |
| అట్ట మీద రేవతి ఫోటో | : | ఆనంద్ చౌరియప్ప |
| HBT ప్రథమ ముద్రణ | : | అక్టోబర్, 2014 |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీనగర్<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,<br>126, శాంతినగర్, హైదరాబాద్ – 28<br>ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# ముందుమాట

మనం హక్కుల గురించి తరచు గట్టిగా మాట్లాడుతూ వుంటాం. అయితే సమాజపు అంచులలో బతికేవారికి ఈ హక్కులు అందుబాటులో వున్నాయా? కులమూ, మతమూ లింగమూ, లైంగికతల పేరుతో వ్యక్తులకు హక్కులు నిరాకరించబడుతున్నాయి. వాళ్లు తమ హక్కుల విషయంలో రాజీ అయినా పడాలి లేదా పోరాడాలి. అట్లా హక్కులు నిరాకరించబడి సమాజపు అంచులకు నెట్టివేయబడ్డ ఒక వ్యక్తిని నేను. ఎందుకంటే పురుషుడిగా పుట్టి స్త్రీగా జీవించాలనుకున్నందుకు! నా జీవితంలో నిత్యమూ నేనెదుర్కున్న వివక్ష, హేళన, వేదనే కాక, నా సహనమూ నా సంతోషమూ కూడా మీ ముందు పరిచేదే ఈ పుస్తకం.

ఒక హిజ్రాగా నేను సమాజపు చివరి అంచులలోకి నెట్టబడ్డాను. అయినా నా జీవితాన్ని మీముందు పెట్టే సాహసం చేస్తున్నాను. ఒక హిజ్రాగా వుండడమే కాదు, సెక్స్‌వర్క్ చెయ్యడం గురించి కూడా చెబుతున్నాను. ఎవరి మనోభావాలనూ నొప్పించడానికి గానీ ఎవరినీ నిందించడానికి కానీ నేనీ పుస్తకం రాయలేదు. హిజ్రాల జీవన విధానం గురించీ వారి ప్రత్యేక సంస్కృతి గురించీ, వారి కలలూ కోరికల గురించీ పాఠకులకు తెలియజెప్పడానికే రాస్తున్నాను.

నేను రాసిన 'ఉనర్వుమ్ ఉరువమమ్' తమిళనాడులో తెచ్చిన ఫలితాలను చూసి నేను గర్వపడుతున్నాను. ఇప్పుడు నా జీవిత చరిత్ర సమాజంలో మరిన్ని మంచి మార్పులు తేగలదని ఆశిస్తున్నాను. అడుక్కోడానికీ సెక్స్‌వర్క్ చెయ్యడానికే కాదు అనేక మంచిపనులు చేసే సామర్థ్యం హిజ్రాలకుందని ఈ పుస్తకం చదివి తెలుసుకుంటారని కూడా నేను ఆశిస్తున్నాను. నేను ప్రభుత్వం నుంచి, ప్రజల నుంచి సానుభూతి ఆశించడం లేదు. హిజ్రాలమైన మాకు సమాజంలో అందరిలాగా జీవించే హక్కు వుందని చెప్పాలనుకుంటున్నాను.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన పెంగ్విన్ ప్రచురణ సంస్థలోని రవి సింగ్‌కూ, తమిళం నుంచి ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేసిన వి.గీతకూ, ఎడిట్ చేసిన ఆర్.శివప్రియకూ నా కృతజ్ఞతలు. సహాయ సహకారాలందించిన సుదేష్ణా షోమే ఘోష్‌కు కూడా నా కృతజ్ఞతలు.

29 డిసెంబర్ 2009 **రేవతి**

బెంగుళూరు

# 1

మాది తమిళనాడులోని సేలం జిల్లా నామక్కల్ తాలూకాలోని ఒక చిన్న గ్రామం. ఆవూరి మధ్యలో మారియమ్మన్, వినాయకుని దేవాలయాలు! ఊరి పొలిమేరలో శ్మశానం పక్కగా కాళికామ్మవారి గుడి. అక్షరాలు నేర్పే దగ్గర్నించీ అయిదో తరగతి వరకూ మాత్రమే బోధించే పాఠశాల కూడా ఒకటుంది. ఆ పైన చదువుకోవాలంటే మూడు మైళ్ళ దూరానున్న నామక్కల్ వెళ్ళాలి. అక్కడ నమగిరి అమ్మ, నరసింహస్వామి, హనుమాన్ దేవాలయాలు కూడా వున్నాయి. అక్కడొక చిన్న దుర్గం కూడా వున్నది. అది నిజానికి ఒకే రాయిని తొలిచి నిర్మించిన గుడి. దాని చుట్టూ ఒక ఎత్తైన ప్రహరీ గోడ వుంది. దాన్ని టిప్పు సుల్తాన్ కాలంలో నిర్మించారట. అక్కడ ప్రతి ఫాల్గుణ మాసంలో పదిరోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి.

మావూళ్ళో అగ్రకులాలూ తక్కువ కులాలూ కూడా వున్నాయి. ఇందులో గౌండర్లు అగ్రకులస్థులు. దిగువ కులాలకు చెందిన వాళ్ళు ఊరి చివర వుంటారు. గౌండర్ల పొలాల్లో పనిచెయ్యడానికే వాళ్ళు ఊళ్ళోకి వస్తారు. దేవాలయంలో ఉత్సవాలప్పుడు కూడా వీళ్ళు ఆలయం లోపలికి పోకుండా బయటినించే పూజలు చేసుకుంటారు. పెళ్ళిళ్ళు కులాలలోపలే జరుగుతాయి.

ఊరి చుట్టూ రాళ్ళూ గుట్టలూ వున్నాయి. అందులో ఒక పెద్ద శిలని "సూర్యశిల" అంటారు. తెల్లవారుఝామున చూస్తే దాని వెనకనుంచే సూర్యోదయం అవుతోందన్నట్లు అనిపిస్తుంది. అక్కడింకొక శిలను 'సన్యాసి శిల' అని అంటారు. పూర్వం ఒక సన్యాసి ఈ శిల మీద ఒక శివలింగాన్ని ప్రతిష్టించి పూజించాడంటారు.

నామక్కల్‌లో ఎక్కువగా లారీలకు బాడీలు కడతారు. కోళ్ళ ఫారాలకు కూడా నామక్కల్ ప్రసిద్ధి. ఊరి చుట్టూ వరి, జొన్న, చెరకు పొలాలున్నాయి,

నామక్కల్ దగ్గరుండే మా గ్రామంలో, మా తల్లితండ్రులకు అయిదో సంతానంగా నేను పుట్టాను. ముగ్గురన్నలూ ఒక అక్క. నాకు దొరైస్వామి అని పేరు పెట్టారు. అందరికన్న చిన్నవాడిని కనుక అమ్మా నాన్నా గారంగా చూశారు. మా ఇల్లు ఆ రోజుల్లోనే పక్కాగా నిర్మించిన రెండస్థుల ఇల్లు. ముందు పెద్ద వాకిలి. దానికెదురుగా పశువుల పాక. మాకు రెండు లారీలూ, అయిదెకరాల మెట్ట పొలమూ వుండేవి. మా నాన్న లారీ నడిపేవాడు. మా పెద్దన్న క్లీనర్‌గా ఆయనకు సాయం చేసేవాడు. మా నాన్న పాలు సరఫరా చేసేవాడు. రోజూ ఉదయం అయిదుగంటలకే మా అన్నలతో సహా బయలుదేరి చుట్టుపక్కల గ్రామాల

నుంచి పాలు సేకరించి పాలఫ్యాక్టరీకి చేరవేసేవాడు. ఈ పనంతా తొమ్మిదిన్నరకల్లా పూర్తి అయేది. మళ్ళీ సాయంత్రం నాలుగింటికి బయలుదేరి పాలు సేకరించి ఫాక్టరీలో అప్పజెప్పాలి. లారీ కేదైనా ఇబ్బంది వచ్చి పాల సరఫరా ఆలస్యం అయినా, అందువలన పాలు విరిగిపోయినా, విరిగిపోయిన పాల ధరను మాకివ్వాల్సిసిన డబ్బులో తగ్గించేవాళ్ళు. మేము అప్పగించిన తరువాత పాలు విరిగితే అది మా బాధ్యత కాదు. కొనుగోలుదార్లూ ఫ్యాక్టరీ యాజమాన్యం చూసుకోవాలి. అట్లా మా నాన్నకీ అన్నయ్యలకీ రాత్రి పదింటికి పని పూర్తయ్యేది. అప్పటి వరకూ వాళ్ళకోసం కాచుకుని వుండి వాళ్ళకు భోజనం పెట్టేది మా అమ్మ. నేనూ అక్కా ఆ పాటికి నిద్రపోయేవాళ్ళం. మానాన్న అన్నంలో సాంబారూ రసమూ వేసుకునేవాడు. తరువాత పెరుగన్నం కలుపుకు వచ్చి నన్ను లేపేవాడు "లేరా! చిన్నోడా! లేచి ఈ పెరుగు ముద్ద తిను!" అని గారం చేసేవాడు. నేను కళ్ళు పూర్తిగా తెరవకుండానే ఆ ముద్ద కాస్తా గుటుక్కున మింగేసి మళ్ళీ నిద్రకు పడేవాడిని.

మా అక్కా మా అన్నలూ పట్నంలో బడికి పోయేవాళ్ళు. నాకప్పుడు పదేళ్ళు. నేను ఆడపిల్లలతో కలిసి మాఊళ్ళో బడికి పోయేవాడిని. అప్పుడు అయిదో క్లాసు. నేను ఎప్పుడూ ఆడపిల్లలతో వాళ్ళాడుకునే ఆటలే ఆడేవాడిని. మా ముందు వాకిలి శుభ్రంగా చిమ్మి ముగ్గులు పెట్టేవాడిని. వంటింట్లో గిన్నెలు తోమడంలో, ఇల్లు కడిగి తుడవడంలో అమ్మకు బాగా సాయం చేసేవాడిని. నేను పెద్ద వాళ్ళంత శుభ్రంగా పనిచేయకపోయినా ఆత్మవిశ్వాసంతో చేసేవాడిని. మా ఎదురింటి వాకిట్లో ముగ్గు మా ముగ్గు కన్న అందంగా వుంటే దాన్ని కాలితో కాస్త చెరిపి ఎవరికీ కనపడకుండా పారిపోయేవాడిని. బడినించి రాగానే మా అక్క లంగా జాకెట్ వేసుకుని. తలకొక తువాలు చుట్టుకుని, దాని కొసలు జడలాగా వీపు మీద వేలాడ దీసేవాడిని. తరువాత సిగ్గుల పెళ్ళికూతురులా కళ్ళు వాల్చుకుని నడిచే వాడిని. అంతా బాగా నవ్వేవాళ్ళు. నేను అప్పటికింకా బాగా చిన్న వాడిని కనుక ఈ చేష్టలని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. "పెద్దయినాక ఈ చిలిపి చేష్టలన్నీ వాడే మానుకుంటాడులే!" అనుకునేవాళ్ళు. కానీ బడిలో మగపిల్లలూ, ఇరుగుపొరుగు కొందరూ నన్ను "ఒరేయ్ ! తొమ్మిదో నంబరూ!" అని వెక్కిరించేవాళ్ళు, ఆడంగి వాడిననే వాళ్ళు.

"నువ్వు మగవాడివి కాదా? ఎందుకట్లా అమ్మాయిల బట్టలేసుకుని, అమ్మాయిల్లాగా నడుస్తావు?" అనేవాళ్ళు. నేను నిజంగా ఆడపిల్లలాంటి వాడినే అనిపించింది. ఆడపిల్లలాగా వుండాలనిపించింది.

ఆ రోజుల్లో మా ఇంటికెదురుగా ఒక కాలేజీ విద్యార్థి అద్దెకుండేవాడు. నాకెప్పుడైనా స్కూల్లో పాఠాలు అర్థంకాకపోతే అతనిచేత చెప్పించుకునే వాడిని. అతని దగ్గర చాలా సేపు వుండేవాడిని. ఒక్కొక్కప్పుడు అతనితో ఆడుకునే వాడిని కూడా. అతను నా బుగ్గలు గిల్లేవాడు. నన్ను కౌగలించుకుని ముద్దులు పెట్టేవాడు. అతను అట్లా చెయ్యడం నాకు

బాగానే వుండేది. కానీ అతను నన్ను “ఆడంగి” అంటేనే మనసు నొచ్చుకునేది. అయినా సిగ్గుపడేవాడిని.

అతనొక రోజు అడిగాడు “నువ్వెందుకు అమ్మాయిలాగా మీ వాకిలి చిమ్మి ముగ్గేస్తావు?” అని.

“నేను మూడో తరగతి చదువుతున్నప్పటి నుంచి వాకిలూడ్చి ముగ్గేస్తున్నాను. అప్పుడు కూడా మా అమ్మ నన్ను పెందలాడే నిద్రలేపేది. ఆవిడ ఆవుపాలు తీస్తూవుంటే నేను పేడకళ్లాపి చల్లి ముగ్గేసేవాడిని. మా అక్క నిద్రలేచేది కాదు, నిద్రలేచిన తరువాత “ఈ ఆడంగి పిల్లవాడు సరిగ్గా వాకిలూడ్చలేదు. ముగ్గు కూడా బాగా వెయ్యలేదు అని అమ్మకి ఫిర్యాదు చేసేది.

సెలవల్లో పొలాలున్న వాళ్ళ పిల్లలు వాళ్ళ ఆవులను, మేకలను పొలానికి తోలుకొచ్చేవాళ్ళు. నేను కూడా వాళ్ళతో వెళ్ళేవాడిని. మేమక్కడ తాటి చెట్లెక్కి కాయలు కోసేవాళ్ళం. మా పొలం ఊరికి ఒక మైలు దూరంలో వుండేది. ఎండ నడినెత్తికి రాగానే మేము పొలంలో వుండే నీళ్ళ పంపు స్విచ్ వేసి ట్యాంకు నింపి అందులోకి దిగేవాళ్ళం. ఆ పచ్చని పొలంలో నేను ఒక అమ్మాయిలా ఊహించుకుంటూ ఆడి పాడేవాడిని.

మా పొలంలో చిలకడదుంపలు నాటినప్పటి సంగతిది. మామూలుగా మా పొలంలో పని చేసేవాళ్ళంతా మాతో వుండేవాళ్లు. కానీ ఈ సారి ఈ పనికి ఎక్కువ మంది కావలసి వచ్చారు. అందుకని ఎక్కువమంది ఆడా, మగా కూలీలని తీసుకొచ్చారు. మగ వాళ్ళు మట్టి తవ్వి మడులు చేసి, నీళ్ళు పెడితే, ఆడవాళ్ళు నాట్లు వేశారు. నేను ఆడవాళ్ల పక్కన నిలబడి నాట్లలో సాయం చేశాను. మా అమ్మ నాకు నాటు వెయ్యడం రాదంటూ నన్ను అక్కడి నించీ తరిమేసింది.

నేనొక కూలీ కొడుకుతో కలిసి కొబ్బరి చెట్టు కింద మట్టితో ఒక గుడి కట్టాను. అతను నాకొక మురుకు తినమని ఇచ్చాడు. నేను దాన్ని నోట్లో పెట్టుకున్నానో లేదో మా అమ్మ పరిగెత్తుకుంటూ వచ్చి, అది లాక్కుని అవతలకి గిరాటేసింది. మా అమ్మ అట్లా ఎందుకు చేసిందో నాకు అర్థం కాలేదు. “ఆపిల్లవాడిచ్చిన మురుకు తింటే నువ్వు మైల పడతావు అంది మా అమ్మ మైల పడ్డం అంటే ఏమిటి?” అని అడిగాను.

“నువ్వు చిన్న వాడివి. నీకలాంటివి తెలియవు” అంది అమ్మ.

“స్కూల్లో మేం ఇట్లాగే తింటాం. ఒకరి నుంచి ఒకరం తీసుకుని కొరుక్కుతింటాం. అది మైల పడ్డమేనా?” అనడిగాను.

“చక్కిలి వాళ్ళ దగ్గర్నుంచి తీసుకుని తింటే దేవుడు నీ కళ్ళు పోగొడతాడు” అంది మా అమ్మ. నాకు ఆశ్చర్యం వేసింది. నాకు చక్కిలి పిల్లలంటే ఏమిటో తెలీదు. వాళ్ళు ఎట్లా వుంటారో తెలియదు. కానీ అప్పటి నుంచీ నేను ఎవరు ఏం పెట్టినా తినలేదు. దేవుడు నిజంగా నా కళ్ళు పీకేస్తాడని భయం వేసింది.

స్కూల్లో మగపిల్లలు గిల్లీ దండా దొంగా పోలీస్, క్రికెట్ ఫుట్బాల్ ఆడేవాళ్ళు. నేను అమ్మాయిలతో కలిసి దాగుడుమూతలూ తొక్కుడు బిళ్ళా లాంటి ఆటలు ఆడేవాడిని. ఆడపిల్లలు నన్ను అప్పుడప్పుడూ "నువ్వు మాతో ఆడతావెందుకు? వెళ్లి మగపిల్లలతో ఆడుకో, పో'' అనేవాళ్ళు. ''నేను వాళ్లతో ఆడను'' అనేవాడిని. ఆడపిల్లలాగా ప్రవర్తిస్తున్నందుకు నన్ను స్కూల్లో బాగా ఏడిపించేవాళ్ళు. ఆడపిల్లలు చేసే పన్లు చేస్తున్నందుకు వీధిలో వాళ్ళు వెక్కిరించేవాళ్ళు. ఇవన్నీ కాక నాకు కాస్త నత్తి వుండేది. అందుకు కూడా ఏడిపించే వాళ్ళు. ఇన్ని కారణాల చేత అందరికీ నేనొక వినోదం అయ్యాను.

స్కూలుకి రోజూ ఒకే యూనిఫామ్ వేసుకు వెళ్ళడం, దాన్నే ఉతికీ ఉతికీ కట్టుకోవటం వలన నా నిక్కర్ వెనక కాస్త చిరిగింది. నా క్లాసు పిల్లలు ఆ చిరుగులో కాగితం ముక్కలు దూర్చి "పోస్ట్ బాక్స్" అని అరిచేవాళ్ళు. నేను ఆడవాళ్ళు తిట్టినట్టు వాళ్ళను బాగా అరిచి తిట్టేవాడిని. ఇందుకు వాళ్ళు మరీ రెచ్చిపోయి "ఆడ పిల్లవాడు" "9వ నంబర్" అని అరిచేవాళ్ళు. ఈ మాటలకి నేను నొచ్చుకున్నా నన్నొక ఆడపిల్లగా భావిస్తున్నందుకు లోలోపల సంతోషంగా వుండేది.

క్లాసులో నేను ఆడపిల్లల వంక చూస్తూ కూచునే వాడిని. వాళ్ళ జడలెట్లా వున్నాయో, రిబ్బన్లు ఎట్లా ముడేసుకున్నారో, వాళ్ల తలల్లో పెట్టుకున్న మల్లె, కనకాంబరం పూల చెండ్లనూ, వాళ్ళు ధరించిన లంగా జాకెట్లనూ పరిశీలించే వాడిని. వాళ్ళలా వుండాలని తపించే వాడిని. వుండలేకపోతున్నందుకు చింతించే వాడిని. అట్లా వాళ్ళని గమనిస్తూ పాఠం మీద దృష్టి పెట్టనందుకు టీచర్ నాకు తొడపాశం పెట్టి, బెంచీ మీద నిలబడమనేవాడు. మోకాళ్ల మీద నిలబడమనేవాడు. నేను పాఠం మీద మనసు పెట్టనందుకే కాక ఆడపిల్లలా కులుకుతున్నానని కూడా టీచర్లు నన్ను శిక్షించేవాళ్ళు. మగపిల్లల్లాగా ధైర్యంగా వుండనందుకు కూడా నేను దెబ్బలు తిన్నాను. మగపిల్లలు ఆడే ఆటల్లో పాల్గొననందుకు మా పి.టి. టీచర్ కూడా నా చెవులు మెలేసేవాడు" అసలు నువ్వు మగాడివా కాదా? ఏదీ నీ నిక్కరు ఊడదియ్ చూస్తా" అనేవాడు. నిజంగా నా నిక్కర్ లాగేస్తాడని భయం వేసి ఏడుపు లంకించుకునేవాడిని. ఇదంతా తక్కిన పిల్లలకి నవ్వులాటగా వుండేది.

నేను అమ్మాయిలా ప్రవర్తిస్తున్నానని నాకు తెలుసు. అట్లా ప్రవర్తించడం నాకు చాలా సహజంగా అనిపించేది. అసలు మగపిల్లవాడిలా ప్రవర్తించడం ఎలాగో నాకు తెలిసేది కాదు. అదెట్లా అంటే, ఎవరైనా నన్ను తినకుండా వుండమంటే ఎట్లా ఉండలేనో అమ్మాయిలా వుండద్దంటే అట్లాగే వుండలేను. వాళ్ళూ వీళ్ళూ చెబుతున్నారు కదా అని నేను అమ్మాయిలా వుండకుండా వుండలేను.

## 2

నేను అయిదో క్లాసు ప్యాసయిపోయి పట్నంలో స్కూలుకి పోవడం మొదలుపెట్టాను. పెద్ద పట్నంలో స్కూలుకి పోతున్నందుకు సంతోషించాను. ఖాకీ నిక్కరూ తెల్లషర్టూ వేసుకునే వాడిని. కానీ అక్కడి పెద్ద పెద్ద రోడ్ల మీద లారీలు బస్సులు, కార్లు, సైకిళ్ళూ నా పక్కనించి పోతూవుంటే భయమేసేది. అప్పుడు మా అమ్మ సలహా గుర్తొచ్చేది. ఎవరైనా పెద్ద పిల్లవాడి చెయ్యి పట్టుకుని ఆ వాహనాలకు దూరంగా నడవమని. రోజూ నేను ఆ పెద్ద పిల్లల వెనకాలే మూడు మైళ్ళు నడచి స్కూలుకు పోయేవాడిని.

రోడ్డు పక్కన వరసగా వున్న పెద్ద ఇళ్ళనూ, గోడ మీదుగా పాకిన పూల తీగెలనూ చూడ్డం బాగుండేది. ఎప్పుడైనా ఒకరోజు ఆ పూలు కోసి టిఫిన్ బాక్స్‌లో పెట్టుకోవాలను కున్నాను. ఒకరోజు ఎవరూ చూడకుండా గోడ ఎక్కి ఒక పువ్వు కోశాను. తరువాత అప్పుడప్పుడూ ఇట్లా దొంగతనంగా పూలు కోసి మా వూరి గుడిలో వినాయకుడికి పూజ చేసేవాడిని.

నేను ఏడవ తరగతిలో వుండగా మా స్కూలు వార్షికోత్సవాల్లో పాల్గొన్నాను. హరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి వేషం వేశాను. నాటకంలో చంద్రమతి కొడుకు పాము కరిచి చనిపోతాడు. ఆ పిల్లవాడి శవాన్ని ఖననం చెయ్యడానికి ఆమె శ్మశానానికి పోతుంది. అందుకు కొంత డబ్బు ఇవ్వాలంటారు కాటికాపర్లు. నిజానికి కాటికాపరి ఆమె భర్తే, కానీ డబ్బు లేకుండా ఖననం చెయ్యడానికి ఒప్పుకోడు. ఆ డబ్బు తేవడానికి ఆమె ఊళ్ళోకి వెడుతుంది. అప్పుడు ఒక విషాద గీతం వస్తూవుంటుంది. నేను నా కృత్రిమ శిరోజాలు గాలికి ఎగురుతూ వుండగా అట్లా నడిచిపోతున్నాను. చీరె కొంగుని భిక్షాపాత్రలా చాపాను. నేను నిజంగా ఒక స్త్రీలాగే వున్నాననీ, అద్భుతంగా అభినయించాననీ అంతా మెచ్చుకున్నారు. నాకు చాలా సంతోషమేసింది.

స్కూల్లో నాకు పదకొండు పన్నెండు క్లాసుల్లోని పెద్ద మగపిల్లల్ని చూస్తే భయం వేసేది. వాళ్ళెప్పుడూ నన్ను వెతికేవాళ్ళు. వాళ్ళు నా ప్రత్యేకతను గుర్తించారు. నన్ను చూసినప్పుడల్లా "ఓయ్! ఆడ పిల్లవాడా" అని అరిచేవాళ్ళు. నా నెత్తిమీద మొట్టేవాళ్ళు. నా ఛాతి మీద గిల్లేవాళ్ళు. "చంద్రమతి వేషం వేసినప్పుడు ఇక్కడ ఏం పెట్టుకున్నావ్?" అని ఏడిపించేవాళ్ళు. అట్లాంటప్పుడు నాకు మా క్లాసులో మగపిల్లల పక్కన కూచోబుద్ధి అయ్యేది కాదు. నన్ను ఏడిపించని మగపిల్లలంటే నాకు ఇష్టంగా వుండేది. వాళ్ళంటే ప్రేమగా అనిపించేది. అయోమయంలో పడేవాడిని. నేనే ఒక మగపిల్లవాడిని. మళ్ళీ నేను మగ పిల్లల్ని ప్రేమించడం ఏమిటి? ఇది తప్పా? తప్పుకాదా?

నా భావాలను ఎవరికీ చెప్పుకోలేను. చివరకి నా అన్నలకి, నా తల్లితండ్రులకి కూడా! కానీ నాలో ఈ అయోమయపు భావాలు పోవడం లేదు. పిచ్చి వాడినైపోతున్నాను.. అందరూ ఏడిపించడం విసుగ్గా వుంది. అంతేకాక ఇంగ్లీష్ క్లాసులో బాగా వెనకబడి

పోయాను. సక్రమంగా స్కూలుకు వెళ్ళడం మానేశాను. క్లాసులు ఎగ్గొట్టేవాడిని. మానాన్న జేబులో నుంచి డబ్బులు కొట్టేసి సినిమాకి పోయేవాడిని. అప్పట్లో అన్నీ బ్లాక్ అండ్ వైట్ సినిమాలే. నాకు ఎంజిఆర్, సరోజా దేవి సినిమాలు బాగా నచ్చేవి. డెబ్భై అయిదు పైసలు పెట్టి నేల టికెట్ కొనేవాడిని. హాలులో కూచున్న ఆ రెండున్నర గంటలూ నా బాధలన్నీ మర్చిపోయే వాడిని. బయటకొచ్చాక నా సంశయాలు మళ్ళీ మామూలే. అందుకని పొద్దున సినిమా అయ్యాక దూరంగా పొలాల్లోకి పోయి, పొద్దున సరోజా దేవి పాడిన సినిమా పాటలు పాడుకునేవాడిని. సాయంత్రం ఏమీ ఎరగనట్లు, స్కూల్ నుంచి వచ్చిననట్లే ఇంటికొచ్చేవాడిని.

నేను బాగా చదువుకోవాలని మా ఇంట్లో అందరూ కోరుకునేవాళ్ళు. "మీ అన్నలు బాగా చదువుకోనందువల్లే జిడ్డోడే బనియన్లు వేసుకుని, ఎండా వానా అనకుండా లారీలో పని చేస్తున్నారు. నవ్వు బాగా చదవుకుంటే అట్లా వుండక్కర్లేదు" అనేది మా అమ్మ. మా నాన్న పాల సరఫరా లారీలతోనూ, మా అమ్మ తన ఆవులు మేకలతోనూ సతమతమౌ తుండటంతో నన్ను పట్టించుకునే తీరికలేదు వాళ్ళకి. మా అక్కే నాతో ఎక్కువ సమయం గడిపేది. ఇద్దరం బాగా తగువులాడుకునేవాళ్ళం.

చివరికెలాగో మా వాళ్లకి నేను స్కూలుకు పోవడం లేదని తెలిసిపోయింది. మా అమ్మ మా అన్నలకు చెప్పగా వాళ్ళు నన్ను బాగా కొట్టారు.

"ఆడంగి వెధవా! ఇంత చిన్నప్పుడే సినిమాకి పోవడానికి డబ్బులు దొంగిలిస్తావా? మేం ఎంత కష్టపడి పనిచేసి నిన్ను స్కూలుకు పంపుతున్నామో చూడ్డం లేదా నువ్వు? రోజూ బడికి వెళ్ళు. ఇవాల్టినించీ పొద్దున్నే గొడ్ల దగ్గర పేడ పోగుచెయ్యి. వాటికి, మేత వేసి నీళ్ళు పెట్టు. అప్పుడు పో స్కూలుకి, సాయంత్రం ఇంటికొచ్చాక కూడా నువ్వీ పన్లు చెయ్యాలి తెలిసిందా? అప్పుడే నీకు కష్టం అంటే ఏమిటో తెలుస్తుంది" అన్నారు మా అన్నలు.

అసలు నాలో జరుగుతున్న సంఘర్షణ వాళ్ళకేం అర్థం అవుతుంది? నా ఆలోచనల్నీ, అయోమయాన్నీ పక్కన పెట్టి, ఎవరెంత ఏడిపించినా చెప్పిన పనులన్నీ చేస్తున్నాను. కానీ కొంతకాలమే అట్లా సాగింది.

ఆ సంవత్సరం మా వూళ్ళో మారియమ్మ తిరణాల. చాలా పెద్ద ఎత్తున జరిగే ఉత్సవం అది. ఊరంతా దీపాలు వెలిగిస్తారు. దేవతని బాగా అలంకరిస్తారు. రాత్రికి బాణసంచా కాలుస్తారు. ప్రతి ఇంట్లోనూ ఆడవాళ్ళు బియ్యంపిండి కొట్టి అందులో కొంచెం నీళ్ళు పోసి ముద్దలా చేస్తారు. దాన్ని ప్రమిదలా చేసి అందులో దీపపు వత్తి పెట్టి వెలిగించి ఆ దీపాన్ని గుడికి తీసుకుపోతారు. నా ఈడు ఆడపిల్లలు మంచి లంగా ఓణీలు ధరించి జడల్లో పూలు పెట్టుకుని ఈ దీపాలను దేవతకి సమర్పిస్తారు. వాళ్ళను చూస్తే నాకు అసూయగా వుంటుంది. నేను కూడా ఆ ఉత్సవంలో పాల్గొనాలని వుంటుంది.

పూజలూ క్రతువులూ అయ్యాక రాత్రి పూట ఊళ్ళో మగపిల్లలు నాటకం వేస్తారు. అందుకోసం నటీమణుల్ని పొరుగూళ్ళ నుంచి డబ్బిచ్చి తీసుకొస్తారు. నేను నేలమీద గోతం పట్టా వేసుకుని కూర్చుని వాళ్లని తదేకంగా చూశాను. ఇంటికొచ్చి అద్దం ముందు నిలబడి నన్ను నేను పరిశీలనగా చూసుకున్నాను.

రెండు రోజుల అనంతరం గుడిలో దేవతకు మేకపోతులను బలి ఇచ్చాక ఆ మధ్యాహ్నం కొంతమంది అబ్బాయిలు తాము పులుల్లాగా పోలీస్‌వాళ్లలాగా ఎలుగు బంటుల్లాగా, దేవతల్లాగా, బంజారాల్లాగా వేషాలు వేసుకుని పాటలు పాడుతూ నృత్యం చేస్తూ చుట్టుపక్కలంతా తిరిగి డబ్బు పోగుచెయ్యాలనుకున్నారు. నేను అమ్మాయిలాగానే వుంటాను కనుక వాళ్ళు నన్ను బంజారా అమ్మాయి వేషం వేస్తావా అని అడిగారు. "వేస్తాను కానీ మా అన్నలేమంటారో అని నాకు భయం" అన్నాను. వాళ్ళు నవ్వేసి నువ్వు మారు వేషంలో వుంటావు కదా? నిన్నెవరూ గుర్తు పట్టర్లే" అన్నారు.

"కానీ నాకు చెవిపోగులూ లంగా జాకెట్టూ సవరమూ కావాలి కదా?" అన్నాను.

"అవ్వన్నీ అద్దెకిచ్చే చోట్లు వున్నయ్ అద్దె డబ్బు గురించి నువ్వేం బెంగ పడకు. పైగా మనం పాట కోసం కూడా ఒక డప్పు వాయించే వాణ్ణి తెచ్చుకోవాలిగదా మనకెలాగూ డబ్బులొస్తాయి కదా? అందులోంచి ఇద్దాం" అన్నారు వాళ్ళు.

నాకు బాగా ఉత్సాహం కలిగింది కానీ మళ్ళీ మా అన్నలు కనుక్కుంటారేమో అని భయం.

"మనం దేవతమెప్పు కోసం ఇట్లా వేషాలేస్తున్నాం. అంతేకాదు మన ఆటపాటలతో వూరివాళ్లకు వినోదం కలిగిస్తున్నాం . మీ అన్నలకు తెలిస్తే మేము సర్ది చెబుతాం కదా" అని వాళ్ళు నా వెంట పడ్డారు.

నేను ఒక స్త్రీలాగా వేషం వేసుకుని నటిస్తున్నానని అందరూ అనుకుంటారు కానీ నేను నిజంగా స్త్రీనే అని నాకు అనిపించింది. బంజారా అమ్మాయి వేషం కోసం నేను ధరించిన జాకెట్లో రెండు దూది బంతులు పెట్టుకున్నాను. లంగా వేసుకున్నాను. సవరంతో పొడుగాటి జడ వేసుకుని కాగితం పూలు పెట్టుకున్నాను. కాళ్ళకి పట్టీలు, కళ్ళకి కాటుక, పెదాలకి రంగూ వేసుకుని నాకు నేనే ఎంతో అందంగా కనిపించి, పాటికి పదిసార్లు అద్దంలో చూసుకున్నాను. నాతో పాటు బంజారా యువకుడి వేషం వేసిన అబ్బాయి నాతో మెల్లిగా "ఒరేయ్! దొరైస్వామీ! నువ్వు అచ్చం అమ్మాయిలాగే వున్నావు. నువ్వేగనక నిజం అమ్మాయివైతే నీతో ప్రేమలో పడివుందును" అన్నాడు. నాకు గర్వంగా అనిపించింది. నామొహం సిగ్గుతో ఎరుపెక్కింది. మిగతా అబ్బాయిలు వెక్కిరింపుగా నవ్వినా నాకు మాత్రం బాగా అనిపించింది.

డప్పు కొట్టే ఆయన డప్పు కొట్టగా మేమంతా వీధుల్లోకి వచ్చాం. మేం ముందుగా గుడిదగ్గర ఆడాలనుకున్నాం. మేం అక్కడికి చేరేలోపలే వీధులన్నీ జనంతో నిండిపోయాయి.

అందరూ కూడా ఎవరెవరు ఏవేషాలలో వున్నారో ఊహించసాగారు. ఎలుగుబంటి వేషం వేసిన అబ్బాయి మొహానికి వేసుకున్న తొడుగు తీసి జనానికి చెయ్యి ఊపగా అందరూ బాగా అరిచారు. వాడిపేరు కృపన్నన్, మునుస్వామి కొడుకు. వినాయకుడి వేషం వేసిన వాడి బాన కడుపు చూసి, వీడు కాంతాయి కొడుకే అయివుంటాడు. వాడికి తప్ప ఎవరికీ అంత పొట్టలేదు" అన్నారు ఒకరు.

మేము సేకరించే డబ్బుకు బాధ్యత వహించడానికి మాతో నలుగురు పెద్దవాళ్ళున్నారు. మమ్మల్ని జనం నుంచి కాపాడడం కూడా వాళ్ల కర్తవ్యం. మేం వీధుల్లో నడుస్తూ వుండగా చాలామంది ఆ పెద్దవాళ్లని "ఈ బంజారా పిల్ల ఎవరు? మనవూరి తాలూకా, పొరుగూరా? నిజంగా అమ్మాయా లేక వేషమా?" అని అడిగారు.

"ఈ అబ్బాయెవరో మీకందరికీ తెలుసు. మేము మాత్రం చెప్పం. మీరే కనుక్కోండి" అన్నారు పెద్దమనుషులు.

గుడి చేరంగానే మేము నాట్యం చెయ్యడం మొదలుపెట్టాము. అక్కడ చేరిన గుంపులో నుంచి కొంతమంది బాగా తాగివున్న వాళ్ళు మాతో కలిసి ఆడడం మొదలు పెట్టారు. ఉత్సాహం ఉరకలు వేస్తోంది. అంతలోకే ఒక తాగుబోతు నా దగ్గరకి వచ్చి నా గుండె మీద చెయ్యి పెట్టి "ఏం పెట్టావిక్కడ? కొబ్బరి చిప్పలా?" అని అడిగాడు. నేను అతని చెయ్యి విసిరికొట్టాను. అది చూసి గుంపంతా విరగబడి నవ్వడం మొదలుపెట్టింది. మా అన్నల కెక్కడ దొరికిపోతానో, ఆడపిల్ల వేషం వేసినందుకు వాళ్ళు తంతారేమో అని భయం వున్నప్పటికీ నేను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

ఆ సాయంత్రం సంరంభమంతా అయ్యాక నేను వేషం తీసేసి ఇంటికి పోయాను. ఆ పాటికే మా ఇంట్లో అందరికీ ఆ బంజారా అమ్మాయెవరో తెలిసిపోయింది. మా అక్క మా అమ్మ చెవిలో "అమ్మా ! చూడు, వాడొచ్చాడు" అంది.

"అయితే వేషం వేశావన్న మాట. అదిసరే, ఆడవేషం వెయ్యడానికి సిగ్గులేదా నీకు?" అంది మా అమ్మ.

దేవత కోసం వేశానని నేను గట్టిగా చెప్పడంతో ఆ గొడవ సద్దుమణిగింది. నా వేషాన్ని నాట్యాన్ని గురించి ఎక్కువ తర్కించవద్దనుకున్నారు మావాళ్ళు.

నేనే బంజారా అమ్మాయినని మా వూరంతా కూడా తెలిసిపోయింది. నేను బయటికొచ్చినప్పుడల్లా నన్ను పిలిచి "ఏయ్ బంజారా? మీ లంబాడీ వాడెక్కడ?" అనడమో, నువ్వు నిజంగా అమ్మాయిలాగే వున్నావు, మేమసలు గుర్తుపట్టలేదు అనడమో, అసలు నువ్వు అమ్మాయిగా పుట్టాల్సింది, దురదృష్టం కొద్దీ అబ్బాయిగా పుట్టావనో అనడం సాగించారు. ఈ మాటలన్నీ నాకు బాగా సంతోషం కలిగించాయి.

నాలో వుండీ, నేను అణిచిపెట్టుకుంటూ వచ్చిన భావాలన్నింటినీ పైకి ప్రదర్శించే అవకాశం నాకు ఆ వేషంలో లభించింది. అందుకే ఆ ఆనందం నాలో చాలారోజులు

వుండిపోయింది. అయితే మగవాళ్ళు నాలో రేపుతున్న భావాలే నాకు సమస్యాత్మకం అవుతున్నాయి. యువకులను చూసినప్పుడంతా నాకు బాగా సిగ్గనిపించేది. అప్రయత్నంగా తలవంచుకుని పోయేవాడిని. వాళ్ల వైపు ఆకర్షితుడనయ్యేవాడిని. మగ వాడినైన నన్ను స్త్రీలు ఎందుకు ఆకర్షించడం లేదని ఆశ్చర్యపడేవాడిని. నేను మగవాళ్లని ప్రేమించడం ఏమిటి? నా కేమైనా పిచ్చా? ఇట్లాంటి భావనలు కలిగే మగవాడిని నేనొక్కడినేనా? నాలాగా ఈ ప్రపంచంలో ఇంకెవరైనా వున్నారా? వుంటే వాళ్ళను నేను కనుక్కోగలనా?

ఇటువంటి సందేహాలన్నీ నాలో నిండిపోయాయి. వాటితోనే బతుకుతున్నాను. రోజులు గడుస్తున్నాయి. ఎప్పటికైనా నన్ను అర్థం చేసుకునేవాళ్ళు లభిస్తారా? అనిపిస్తుంది.

ఎట్లాగో పదో క్లాసుకి వచ్చాను. నా శరీరంలోనూ మనసులోనూ కూడా మార్పులొచ్చాయి. అణిచిపెట్టుకోడానికి వీల్లేనంతగా నాలో స్త్రీత్వం తలెత్తుతున్నది. నేను ఒక మగ శరీరంలో ఇరుక్కుపోయిన స్త్రీని అనిపించేది. అదెలా సంభవం? ప్రపంచం నన్నట్లా అంగీకరిస్తుందా? నన్ను మగవాడిలా గుర్తిస్తున్నందుకు బాధగానూ, స్త్రీగా గుర్తించబడాలనే తపనతోనూ వేగిపోతున్నాను. నాకు మగవాళ్లతో గడపాలని వుండేది. అందుకు సిగ్గుపడేవాడిని. దేవుడు నాకెందుకిలాంటి శిక్ష విధించాడో అనుకునేవాడిని. ఆయన నన్ను పూర్తిగా స్త్రీగానో పూర్తిగా పురుషుడిగానో ఎందుకు సృష్టించలేదు? ఇట్లా తప్పుగా ఎందుకు పుట్టాను? చచ్చిపోతే బాగుండును అనిపించేది. చదువుతున్నట్టు నటిస్తానే కానీ చదువు బుర్రకెక్కదు. రోజంతా ఇవే ఆలోచనలు, అయోమయం, ఆదుర్దా.

చదువు మీద శ్రద్ధ పెట్టకపోవడం వల్లా, ఇంగ్లీషులో సరైన అభినివేశం లేకపోవడం వల్లా పదోక్లాసు తప్పాను. అందులో ఇరవై ఆరు మార్కులొచ్చాయి. మిగతా అన్ని సబ్జెక్టుల్లో పాస్ అయ్యాను ఒక సంవత్సరం ఇంట్లో వుండి ఇంగ్లీష్ చదివి పాస్ అవాలి. నేననుకున్నట్టు మానాన్న నన్ను తిట్టలేదు. కానీ ఇలా అన్నాడు "నువ్వు బాగా చదవుతానంటే నిన్ను మళ్ళీ స్కూలుకు పంపిస్తాను. లేకపోతే లారీలోకి వచ్చి నాకు సాయం చెయ్."

అయితే మా అన్నలు ఇంత ఉదారంగా లేరు. "ఈ ఆడంగివాడు తప్పుతాడని మాకు ముందే తెలుసు. వాడెప్పుడైతే ఆడవేషం వేశాడో అప్పుడే ఎందుకూ పనికిరాడని అర్థం అయింది. ఇంకా ఇంట్లోవుండి ఒక ఏడాది వ్యర్థం చేసుకోడం ఎందుకు?" అన్నారు వాళ్ళు.

కానీ ఆ సంవత్సరం అంతా నేనెంతో కష్టపడ్డాను. వాళ్ల బట్టలుతికాను, పేడ పోగేశాను. గొడ్లపాక శుభ్రం చేశాను. ఆవులకి గడ్డికోసి తెచ్చాను. నిజంగానే ఇంగ్లీష్ క్లాసుకి పోవాలనిపించింది. అందుకని నన్ను ఇంగ్లీష్ ట్యూషన్‌కి పంపించమని అడిగాను. సరేనన్నారు. సాయంత్రం ఆరు నుంచీ ఎనిమిది దాకా పట్నంలో ట్యూషన్‌కి పోయేవాడిని. అందుకోసం నాకొక సైకిల్ కూడా కొనిచ్చారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Oka+Hijra+Atmakatha](http://kinige.com/book/Oka+Hijra+Atmakatha)**

* * *